సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 54.51 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో ఆదివారానికి 54.51 టీఎంసీలు ఉన్నాయి. పైనుంచి 10,200 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 1000, ఉత్తరకాలువకు 540, దక్షిణ కాలువకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,095
3 శాతం జీఎస్టీతో	రూ.7,308
నవర (8 గ్రా)	రూ.58,464

గరిష్టం/కనిష్టం
36.2 /27.0

వాతావరణం
జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి ఉక్కపోతగా ఉంటుంది. గాలో తేమ 66 శాతం ఉంది.

న్యూస్‌రీల్

మద్యం దుకాణం కొనసాగింపు



మద్యం దుకాణం వద్ద అమ్మకాలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గాలో గంధమహోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది మద్యం దుకాణాన్ని మూసివేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గంధం జరిగే ప్రాంతంలో మద్యం దుకాణం కొనసాగింది. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగాయి. ఉత్సవాలకు ముందు అన్ని శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారిణి మద్యం దుకాణంపై చర్చించకుండానే ఆ నాడు సమావేశాన్ని ముగించారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులకు అవగాహన లేకపోవడంతో అమ్మకాలను కొనసాగించారు. అప్రమత్తమైన ఎక్సైజ్ శాఖ అధికారులు సాయంత్రం 4 గంటలకు దుకాణాలను మూసివేశారు. ఇదంతా అధికారుల సమన్వయ లోపమేనని స్థానికులు విమర్శిస్తున్నారు.

టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.నాగప్రసాద్, జాయింట్ సెక్రటరీ పి.రవికుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఏపీఆర్‌డీఈఏ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ మునవర్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పి. మునెయ్య (తెలుగుగంగ ప్రాజెక్టు), కార్యదర్శిగా కె. కుమార్ (ఆర్‌అండ్‌బీ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. విజయకుమార్ (ఇరిగేషన్), కార్యనిర్వాహక కార్యదర్శిగా జీవీఎస్ రవికుమార్(ఆర్‌అండ్‌బీ), ఫైనాన్స్ సెక్రటరీగా జి.మధుసూదన్ (సోమశిల ప్రాజెక్ట్)లు ఎన్నికైయ్యారు. పలు శాఖల నుంచి ఇద్దరు ఉపాధ్యక్షులుగా, మరో నలుగురు సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవిప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు విశ్వనాథం, కృష్ణారావును నూతన కార్యవర్గం ఘనంగా సత్కరించింది.

కోవూరు.. అల్లుడు జాగీరు

వసూళ్లలో తగ్గేదే లేదంటున్న షాడో ఎమ్మెల్యే
- అవినీతికి కేరాఫ్‌గా మారిన కోవూరు
- ఇసుక నుంచి అభివృద్ధి పనులు అన్నింటా అతనే
- ప్రతి పనికి 5 శాతం కమీషన్ డిమాండ్
- గత ప్రభుత్వంలో మంజూరైన పనుల కాంట్రాక్టర్లనూ వదలని వైనం
- 12 వేల టన్నుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నా.. చర్యలు నిల్
- షాడో ఎమ్మెల్యే దోపిడీతో తమ్ముళ్ల బేజారు

ఆయన నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులకు బంధువు. వరసకు అల్లుడు. ప్రశాంతిరెడ్డి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పటి నుంచి నియోజకవర్గంలో తిష్టవేసి గిల్లుడు ప్రారంభించాడు. టీడీపీ అధికారంలోకి రావడం, ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో దోపిడీకి మాస్టర్ ప్లాన్ వేసుకున్నాడు. ఆమె ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచి షాడో ఎమ్మెల్యేగా రంగ ప్రవేశం చేసి అక్రమాలకు తెర తీసినట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇసుకతో దోపిడీ ప్రారంభించిన షాడో ఎమ్మెల్యే ప్రతి పనికీ కమీషన్ ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నాడు. గత ప్రభుత్వంలో ఖరారైన పనులనూ వదలకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. మొత్తంగా వంద రోజుల్లోనే కోవూరును అవినీతికి కేరాఫ్‌గా మార్చేశాడు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'అవినీతి రహిత పాలన, వివాదరహిత పాలనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం. అందరూ సహకరించండి. ఇసుక, మట్టి, గ్రావెల్ దందాలు చేయొద్దు. గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి పనులు ప్రతిపాదించండి తప్పక చేద్దాం' ఇది కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తరచూ నియోజకవర్గ పర్యటనల్లో చెప్పే సూక్తులు. అయితే ఇవన్నీ గాలి మాటలని గడిచిన వంద రోజుల పాలనలోనే తేలిపోయింది. ఆ నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోంది. స్థానిక ఎమ్మెల్యే బంధువు షాడో ఎమ్మెల్యేగా కొనసాగుతూ వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ప్రతి పనికి రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు సంబంధించి కాంట్రాక్టర్ల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తుండడంతో లబోదిబోమంటున్నారు. మినగల్లు నుంచి ఇందుకూరుపేట వరకు పెన్నానదిలో అడుగడుగునా ఇసుక దోపిడీకి తెర తీశారు.

కమీషన్ ఇవ్వలేదని.. మైపాడు రోడ్డు పనులకు బ్రేక్

కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో పర్యాటక ప్రదేశంగా ఉన్న మైపాడు బీచ్‌కు వెళ్లే రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వంలో రూ.48 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులతో నెల్లూరు– మైపాడు వెళ్లే రహదారి 2/500 నుంచి 22/200 కిలో మీటర్ల వరకు రోడ్డు విస్తరణతో పాటు బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లకు ఆహ్వానించారు. అప్పట్లో నెల్లూరుకు చెందిన ఓ ప్రముఖ కాంట్రాక్టర్ 4 శాతం లెస్‌తో టెండర్లు దక్కించుకున్నాడు. ఆ వర్క్‌కు సంబంధించి అగ్రిమెంట్ పూర్తయ్యే సరికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వర్క్ ప్రారంభించలేదు. ప్రస్తుతం వర్క్ ప్రారంభించేందుకు సిద్ధపడగా షాడో ఎమ్మెల్యే కూడా పెద్ద కాంట్రాక్టర్ కావడంతో వర్క్ ప్రారంభానికి ససేమిరా అన్నాడు. ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజినీరింగ్ అధికారులను బెదిరించి ఆ వర్క్ సంబంధించి 5 శాతం కమీషన్ ఇవ్వాలని చెప్పించాడు. లేని పక్షంలో 60సీ ద్వారా కాంట్రాక్ట్ అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసి తనకు అగ్రిమెంట్ చేసివ్వాలని ఒత్తిడి తేవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒక వేళ రాజకీయ ఒత్తిళ్ల తలొగ్గి వర్క్ క్యాన్సిల్ చేస్తే సదరు కాంట్రాక్టర్ న్యాయ స్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ వివాదం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా షాడోకు అనుకూలంగానే పని చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

గత ప్రభుత్వంలో ప్రారంభమైన పనులనూ వదలని వైనం

షాడో ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో ప్రారంభించి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను వదల్లేదు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం– దగదర్తి, రాజుపాళెం–ఇస్కపల్లి వరకు వెళ్లే రోడ్ల విస్తరణ పనులకు గత ప్రభుత్వంలోనే ఎన్‌డీబీ ద్వారా ఆయా వర్క్‌లకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు ప్రారంభమైనా.. దశల వారీగా జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం జిల్లా మొత్తంలోని పనులన్నీ ఒకే ప్యాకేజీ ద్వారా టెండర్ల ప్రక్రియ జరిగింది. ప్రముఖ కాంట్రాక్టర్ ఆయా వర్కులకు సంబంధించి టెండర్ దక్కించుకుని సబ్ కాంట్రాక్టర్లకు పని అప్పగించారు. ఇప్పటికే ఆయా పనులు రోడ్డు వైండింగ్‌తో పాటు వంతెనలు నిర్మించారు. ఇక బీటీ రోడ్లు వేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయా రోడ్ల పనులను కొనసాగించాలంటే 5 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని షాడో ఎమ్మెల్యే సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల ద్వారా ఒత్తిడి తేవడంతో సదరు సబ్ కాంట్రాక్టర్లు అడిగినంత ఇచ్చుకోకపోతే.. నష్టపోతామని ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా చేసిన పనులకూ బిల్లులు

కోవూరు నియోజకవర్గంలోని వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పంట కాలువలను అభివృద్ధి చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సొంతంగానే యంత్రాలు పంపించి కాలువలు బాగు చేయించారు. అయితే షాడో ఎమ్మెల్యే మాత్రం ఆయా పనులకు కూడా అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి బిల్లులు చేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా ఇరిగేషన్ శాఖలో వివిధ రకాల పనుల కోసం రూ.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారని ప్రచారం జోరుగా సాగుతుంది.




నెల్లూరు పెన్నానది వద్ద ఇసుక రవాణా కోసం బారులు తీరిన ట్రాక్టర్లు

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక దోపిడీ

కోవూరులో షాడో ఎమ్మెల్యేగా చెలామణి అవుతున్న ఆయన టీడీపీ అధికారంలోకి వచ్చాక మినగల్లు ఇసుక డంపింగ్ యార్డు నుంచి 12 వేల టన్నుల ఇసుకను బహిరంగంగానే అక్రమ రవాణా సాగించిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. డంపింగ్ యార్డు నుంచి ఇసుకను బిల్లులు లేకుండా అక్రమ రవాణా చేశారనే విషయం బయటపడడంతో మైనింగ్‌శాఖ అధికారులు డంపింగ్‌ను పరిశీలించి 12 వేల టన్నుల ఇసుక మాయమైన మాట వాస్తవేనని నిర్ధారించారు. విజిలెన్స్ అధికారుల ద్వారా విచారణ జరిపిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. అయితే విచారణ పర్వం కథ కంచికి చేరినట్లు తెలుస్తోంది. సదరు షాడో ఎమ్మెల్యే ప్రస్తుతం పెన్నానదిలో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఒక వైపు షాడో వేసిన ఇసుక టెండర్ చెల్లుబాటు కాదని అగ్రిమెంట్ క్యాన్సిల్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చినా ఇరిగేషన్ అధికారులు మాత్రం కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి ఇసుక రవాణా సాగించడం విశేషం. బుచ్చిరెడ్డిపాళెం నుంచి కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట వరకు దాదాపు ఏడు చోట్ల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మితమైన నెల్లూరు–మైపాడు రోడ్డులో ఒక భాగం



పోతిరెడ్డిపాళెం వద్ద డంపింగ్ చేసిన ఇసుక

మహిళను అడ్డం పెట్టుకుని చౌకబారు కుట్రలు

- పోలీసులే నిజం నిగ్గు తేల్చాలి
- ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల

కావలి: దొంగ బంగారం కోసం విజయవాడకు చెందిన ఒక మహిళ 2012లో కావలికి చెందిన వ్యక్తికి రూ.1.5 కోట్లు ఇస్తే, డబ్బు తీసుకున్న వ్యక్తి బంగారం ఇవ్వలేదంటూ 2024లో వచ్చి తనకు న్యాయం చేయాలంటూ, ఆ వివాదంలోకి నన్ను తీసుకురావడం వెనుక భారీ కుట్ర ఉందని, బాధిత మహిళతో కలిసి చౌకబారు కుట్రలు పన్నిన వ్యక్తుల బాగోతం పోలీసులే విచారించి తేల్చాలని కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014–2019 మధ్య ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పటికీ, అధికారంలో ఉన్నది టీడీపీ అని అన్నారు. ఆ రోజుల్లో తనపైనే పోలీసు కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. బాధిత మహిళ చెప్పినట్లు 2017లో ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అడిగితే, ఆయన డీఎస్పీ వద్దకు సదరు మహిళను తీసుకెళ్లమని చెప్పారని సుకుమార్‌రెడ్డి గుర్తు చేశారు. పోలీసులు మనం చెప్పింది ఎందుకు వింటారు, ఎందుకు చేస్తారని తాను ఆ నాడే ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెప్పానన్నారు. ఆమె చాలు సార్లు వచ్చిందని, ఒక్కసారి డీఎస్పీ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించమని సర్ది చెప్పడంతో తప్పని పరిస్థితుల్లో ఆ మహిళను వెంట పెట్టుకుని డీఎస్పీ వద్దకు వెళ్లినట్లు చెప్పారు. అప్పట్లో డీఎస్పీ బాధిత మహిళ డబ్బు ఇచ్చింది విజయవాడలో కాబట్టి అక్కడికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలే కానీ, కావలిలో తాము చేయగలిగింది ఏమీ లేదని స్పష్టం చేశారని సుకుమార్‌రెడ్డి చెప్పారు. ఇదే విషయాన్ని బాధిత మహిళకు చెప్పి వెళ్లిపోయానన్నారు. జరిగింది ఇది అయితే, దొంగ బంగారం కొనుగోలు, అమ్మకాల విషయంలో తానేదో తలదూర్చినట్లు, ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కట్టు కథలు అల్లి, తన వ్యక్తిత్వాన్ని హననం చేయడానికి భారీ కుట్ర పన్నారని సుకుమార్‌రెడ్డి మండి పడ్డారు. 2012లో దొంగ బంగారం కోసం విజయవాడలో డబ్బు ఇస్తే, 2017లో నా వల్ల ఏదో జరిగినట్లు, 2024లో విలేకరుల సమావేశం పెట్టి ఆరోపించడం ఎంత వరకు సమంజసం అని సుకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. విజయవాడ మహిళ దొంగ బంగారం కొనుగోలు విషయంలో తనకు ఎటువంటి సంబంధం ఉందని నిరూపిస్తే కావలి నడిబొడ్డున ఉరేసుకుని చస్తానన్నారు. 2023 అక్టోబర్ నుంచి దొంగ బంగారం అంటూ జనాలకు బురిడీ కొట్టి దోపిడీలు చేసే ముఠాను జిల్లా పోలీసులు పెద్ద ఎత్తున ప్రత్యేక టీంలను వేసి కేసులు నమోదు చేసి బాధితులకు అండగా నిలిచినప్పుడైనా ప్రస్తుత బాధిత మహిళ పోలీసులను కలిసి ఉంటే న్యాయం జరిగేది కదా అన్నారు.



మాట్లాడుతున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డి

గంధం దంచేందుకు మహిళల పోటీ



క్యూలో వెళ్లి దర్శనం చేసుకుంటున్న భక్తులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా 251వ గంధమహోత్సవంలో భాగంగా మహల్ వద్ద గంధం దంచేందుకు మహిళలు పోటీ పడ్డారు. ఎక్కడా తొక్కి సలాట జరగకుండా పోలీసులు మహిళలను అనుమతించారు. ఇందు కోసం మహిళా పోలీసులను ఎక్కువగా ఏర్పాటు చేశారు. దీంతో గంధం దంచే కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. రాత్రి 2 గంటలకు గంధం దర్గాకు చేరుకుంటుందని వక్ఫ్ బోర్డు ఈఓ హుస్సేన్ తెలిపారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు, వక్ఫ్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. దర్గాలో భక్తుల రద్దీ పెరిగింది. గంధమహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయడంతో సాఫీగా భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. భారీ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. దర్గాను విద్యుద్దీపాలంకరణలో అలంకరించడంతో దర్గా శోభాయమానంగా మారింది. గంధమహోత్సవానికి గతం కంటే ఈ దఫా ప్రజలు అధికంగా వచ్చారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌పై ఫిర్యాదు

బిట్రగుంట: సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా దివ్యప్రసాదమైన లడ్డూపై సీఎం చంద్రబాబు లేవనెత్తిన వివాదాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎంపై మద్దిబోయిన రఘు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బిట్రగుంట ఎస్సై భోజ్యాకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను పోలీసు కేసులతో వేధించే ఉద్దేశంతోనే తప్పుడు ఫిర్యాదు చేసినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెడ్డి జాతి ప్రగతికి సోపానాలు వేద్దాం

- సంఘటితంగా సాగుదాం.. ఐక్యతగా ఎదుగుదాం
- విద్య, విజ్ఞానంతోనే రెడ్డి సంఘీయుల ఉన్నతి, ప్రగతి
- రెడ్ల మేధోమథనం సదస్సులో వక్తల పిలుపు

నెల్లూరు (బృందావనం): విశ్వ వ్యాప్తంగా ఉన్న 'రెడ్డి సంఘీయులు' తారతమ్య భేదాలను విస్మరించి సంఘటితంగా సాగి ఐక్యతగా ఉన్నతంగా ఎదగాలని రెడ్డి సంఘీయులు పిలుపునిచ్చారు. ప్రధానంగా విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన పేద రెడ్డి సంఘీయులను గుర్తించి ఆర్థికంగా తోడ్పాటు అందించి వ్యక్తి అభివృద్ధితో పాటు జాతి ప్రగతికి సోపానాలు వేయాలన్నారు. ఐక్యతే సంఘం, జాతి మనుగడకు ప్రధానమన్నారు. ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా ముందుకు సాగితే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతామన్నారు. ఆ దిశగా రెడ్డి సంఘీయులు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. అందుకు మేధావులైన రెడ్డి సంఘీయుల సూచనలు, సలహాలు తీసుకోవాలని దిశా నిర్దేశనం చేశారు. నగరంలో భక్తవత్సలనగర్‌లోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో 'రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు' అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'రెడ్ల మేధోమథన సదస్సు' నిర్వహించారు.

మేధావులుగా తీర్చిదిద్దే క్షేత్రం: కేపీజే రెడ్డి



మారుతున్న కాలానుగుణంగా రెడ్డి సంఘీయులు అన్ని రంగాల్లో ముందుండాలని, అందుకోసం లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రముఖ సైంటిస్ట్, ఇస్రో శాస్త్రవేత్త కేపీజే రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానంగా విద్దే ప్రగతికి సోపానమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి తమ పిల్లలను విద్య పరంగా విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. జాతికి స్ఫూర్తిగా నిలిచిన రెడ్డి సంఘీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా తనవంతు సహకారాన్ని సంఘానికి అందిస్తానన్నారు. కర్ణాటక రాష్ట్రంలో గౌరిబిదనూరు వద్ద సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రంగాల్లో సంఘీయులను మేధావులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వ్యవసాయ, పారిశ్రామిక క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. బెంగళూరుకు వచ్చే వారు ఈ క్షేత్రాన్ని సందర్శించాలని, వారి ఉన్నతికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నెల్లూరు బీవీనగర్‌లోని ఏఎస్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగిన రెడ్ల ఐక్యవేదిక సదస్సులో రెడ్ల ఐక్యతను తెలుపుతున్న సభ్యులు

వైద్య పరంగా నా వంతు సాయం : డాక్టర్ బీబీ రెడ్డి



ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉన్న రెడ్డి సంఘీయులకు వైద్య పరంగా ఏ అవసరమొచ్చినా మెరుగైన రాయితీలతో వారికి ఉత్తమ వైద్య సేవలందిస్తామని హైదరాబాద్‌కు చెందిన అమోర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత, సమాజ సేవకులు డాక్టర్ బీబీ రెడ్డి ప్రకటించారు. పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో 'మానవ సేవా సమితి'ని స్థాపించి ప్రతి నిత్యం హైదరాబాద్‌లోని తమ ట్రస్ట్ వద్ద ఉదయం 125 మంది పేదలకు, మధ్యాహ్నం 150 మంది బాలలకు ఉచితంగా భోజన సదుపాయం కలిగిస్తున్నామన్నారు. సమాజంలో, జీవనంలో ప్రతి అడుగులో సమస్యలు ఉంటాయన్నారు. ఆ సమస్యలను త్రికరణ శుద్ధిగా తెలుసుకుని మనోవాచకర్మలతో పరిష్కరించుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలన్నారు. తాను వైద్య విద్యనభ్యసించిన తర్వాత పేదల కోసం రెండు రూపాయలకే వైద్య సేవలందించడం ప్రారంభించానన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న రోజుల్లో మార్గదర్శకులుగా ఉన్న కొండపల్లి సీతారామయ్య, గద్దర్, జార్జిరెడ్డితో పాటు విశ్వ హిందూ పరిషత్ పెద్దల నుంచి ఎన్నో విషయాలను తెలుసుకున్నానన్నారు. 'మనం మన కోసం కాదు ప్రజల కోసం బతకాలి' అన్నది నాడు పెద్దలు చెప్పిన మాటలను నేటికి ఆచరిస్తున్నానన్నారు. తల్లిదండ్రులిరువురూ సమానులేనన్న విషయాన్ని ప్రతి బిడ్డ గుర్తించాలన్నారు. దెబ్బ తగిలినప్పుడు అమ్మా అంటూ ఎలా అంటామో... కష్టమొచ్చినప్పుడు పరిష్కారం కోసం నాన్న కోసం ఎదురు చూస్తామన్నారు. తెలంగాణలో తాను ఏర్పాటు చేసిన పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రెడ్డి సంఘీయులైన 150 మంది విద్యార్థులకు ఉన్నత విద్యకు సహకారాన్ని నేటికీ కొనసాగిస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో తన సేవ కార్యక్రమాలను ప్రారంభించాలన్న ఆలోచన ఉందన్నారు. ఇస్కాన్ ద్వారా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్న ఆలోచన చేస్తున్నానన్నారు.

సాయంలో ముందున్న రెడ్ల ఐక్యవేదిక : డాక్టర్ బీవీరెడ్డి

రెడ్డి సామాజిక వర్గీయుల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాయం చేయడంలో రెడ్ల ఐక్యవేదిక ముందుందని వేదిక నెల్లూరు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీరెడ్డి తెలిపారు. ఈ ఏడాది 30 మంది ప్రతిభగల విద్యార్థులకు రూ.6 లక్షలు ప్రోత్సాహక నగదును అందజేసి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించామన్నారు. దేశంలో ఏ ప్రాంతం వారైనా సరే ప్రతిభగల రెడ్డి సంఘీయుల బాలలకు సహకారాన్ని అందజేసేందుకు రెడ్ల ఐక్యవేదిక ముందుందన్నారు. వెంకటగిరికి చెందిన విద్యార్థి చరణ్‌కుమార్‌రెడ్డి విద్యకు రూ.3 లక్షలు, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి తిరుపతికి చెందిన ఎద్దల పూజితకు రూ.85 వేలు అందజేశామన్నారు. సదస్సులో వివిధ రంగాలకు, సంస్థలకు చెందిన పలువురు మేధావులు వి.ధనుంజయరెడ్డి, హైటెక్ రమణారెడ్డి, వేణుగోపాలరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి,, జి.ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృపాకర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, గోపాలరెడ్డి, మాదారెడ్డి, జి.కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రెండు వేల మందికి పైగా రెడ్డి సంఘీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. రెడ్డి సంఘీయుల గుణగణాలను, ప్రతిష్టతను, వారు దేశం కోసం సాగించిన పోరాటాలను వివరిస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

బాణసంచా నిల్వలపై కేసు నమోదు



బాణసంచాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): అక్రమంగా బాణసంచా నిల్వ చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో రాజా అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతను తన ఇంటి మిద్దెపై బాణసంచాను అక్రమంగా నిల్వ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆదివారం దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా బాణసంచాలు నిల్వ ఉంచినా, విక్రయాలకు పాల్పడినా కేసులు తప్పవని హెచ్చరించారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు(క్రైమ్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు డివిజన్ (జోన్-3) పరిధిలో 76 మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆ శాఖలో ఉన్న ఇన్‌స్పెక్టర్లతోపాటు సెబ్ నుంచి రిపోర్టు చేసుకున్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. అందులో భాగంగా జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లు, ఈఎస్ టాస్క్ ఫోర్స్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐఎంఎల్ డిపోలకు 15 మంది ఇన్‌స్పెక్టర్లు నియమితులయ్యారు. పి.రమేష్‌బాబు నెల్లూరు-1కు, ఎల్.లక్ష్మీప్రసన్న నెల్లూరు-2, ఎస్.శ్రీనివాసులు కావలి, బి.కిశోర్ కోవూరు, కేపీ కిశోర్ బుచ్చిరెడ్డిపాళెం, టి.లక్ష్మణ్ స్వామి ఉదయగిరి, షేక్ ఎండీ అబ్దుల్ జలీల్ కలిగిరి, జీవీ ప్రసాద్‌రెడ్డి ఇందుకూరుపేట, ఆర్వీ రమణమ్మ, ఆత్మకూరు, వి.వెంకటేశ్వరరావు పొదలకూరు, బి.వెంకట్రావు, కందుకూరు, ఐతా శ్రీనుబాబు ఈఎస్ టాస్క్‌ఫోర్స్, పి.అనిత ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, వైవీ వెంకటేశ్వర్లు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, జి.మల్లికార్జునరావుకు ఐఎంఎల్ డిపో, దేవరపాళెంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్‌లు కల్పించగా విధుల్లో వెంటనే చేరాలని డైరెక్టర్ ఆదేశించారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన చిన్నారి హాసిని

సీతారామపురం: మండలంలోని పండ్రంగి గ్రామంలో ఆదివారం దొడ్ల హాసిని అనే చిన్నారి కోతుల దాడిలో గాయాలపాలైంది. స్థానికుల కథనం మేరకు.. హాసిని తినుబండారాలు తీసుకొని ఇంటికెళ్తున్న క్రమంలో కోతులు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు చిన్నారిని 108 అంబులెన్స్‌లో సీతారామపురం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కొంతకాలంగా సీతారామపురం పంచాయతీలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి



లూజు బియ్యం బస్తా


ఆత్మకూరు: పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణానికి చేర్చేందుకు వాహనం ఉంది. అయితే ఆదివారం ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్‌ను లోడ్ చేసుకున్న వాహనం బైపాస్‌రోడ్డులోని వాహన యజమాని ఇంటి వద్ద నిలిచింది. నాలుగు బియ్యం బస్తాలను అక్కడ చేర్చి విడిగా కొన్ని బియ్యం చిన్న బస్తాలో నింపి వ్యాన్‌లోకి చేర్చారు. దీని విషయమై వ్యాన్ డ్రైవర్‌ను స్థానికులు ప్రశ్నించగా యజమాని చెప్పడంతో చేశానని పేర్కొన్నాడు. కాగా ఎంఎల్ పాయింట్‌లో ఉండే సిబ్బంది దీనిపై స్పందిస్తూ బియ్యం లోడ్ చేసి ఏ దుకాణాలకు సరఫరా చేయాలో అక్కడికి మాత్రమే చేర్చాల్సి ఉందన్నారు. మధ్యలో ఎక్కడా దించరాదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ గుర్తుతెలియని మహిళ గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు పట్టాలపై ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి వయసు 50 నుంచి 55 ఏళ్లలోపు ఉంటుంది. నలుపు రంగు టీ షర్ట్, పసుపు రంగు ప్యాంట్ ధరించి ఉంది. నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘విద్యుత్’తో తస్మాత్ జాగ్రత్త

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- ఈ సమయంలో అప్రమత్తతే శ్రీరామరక్ష
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం
- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వీసులు 12,65,562



గృహ సర్వీసులు	9,06,026
వాణిజ్యం	99,586.
వ్యవసాయం	1,95,884
పరిశ్రమలు	4,216
వీధి దీపాలు, వాటర్ వర్క్స్	25,433
హెచ్‌టీ	735
ఆక్వా సర్వీసులు	33,682

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా వ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. తడి చేతులతో స్విచ్ వేయడం, తెగిపోయిన కేబుల్ వైరు చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని ముట్టుకోవడం, ఇంట్లో ఉన్న వైర్లపై తడి బట్టలను ఆరేయడం వంటి చర్యలు ప్రాణాల మీదకు తెస్తాయి. అందువల్ల తగిన జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. ప్రస్తుతం అధికారులు వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వర్షాకాలంలో..

- తడిసిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.
- వర్షం, ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ వైర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదు.
- ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో డిష్ కనెక్షన్లను తీసివేయాలి.
- వర్షం పడే సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ల స్విచ్‌లను ఆఫ్ చేయాలి. లేకపోతే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది.
- వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు.

వ్యవసాయ భూముల వద్ద..

- వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లను తాకకూడదు. మోటార్ ఆన్ చేసే సమయంలో తప్పనిసరిగా కాళ్లకు చెప్పులు వేసుకోవాలి.
- విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయొద్దు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయొద్దు.



ఇలా చేస్తే..

- ఇళ్లు, మిద్దెపై ఆడుకునే పిల్లలు విద్యుత్ వైర్ల వద్దకు వెళ్లకూడదు.
- గృహాల్లో వాటర్ హీటర్ వాడే సమయంలో స్విచ్ ఆఫ్ చేయకుండా నీటిని తాకకూడదు. ప్లగ్ తీసిన తర్వాతే వేడి నీటిని వాడాలి.
- పొడవైన ఇనుప చువ్వలు, పైపులు తీసుకెళ్లే సమయంలో విద్యుత్ లైన్లకు తగలకుండా చూసుకోవాలి.
- ఇళ్లలో విద్యుత్ సరఫరా కోసం వినియోగించే వైర్లు జాయింట్లు (అతుకులు) ఉండకుండా చూడాలి.
- విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను ముట్టుకోకూడదు.
- ఇళ్లలో కరెంట్ స్విచ్‌లను తడి చేతులతో వేయకూడదు.
- ఇంటి బయట ఏర్పాటు చేసిన లైట్లు తడవకుండా చూడాలి.
- చిన్న పిల్లలు కరెంట్ వస్తువుల వద్దకు వెళ్లకుండా చూడాలి.
- ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై ఆర వేయకూడదు.
- విద్యుత్ స్తంభాల కింద నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదు.
- స్తంభం నుంచి గృహాలకు వచ్చే విద్యుత్ సర్వీసు వైరు దెబ్బతింటే వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి.
- ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ గృహోపకరణాలను వినియోగిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం తగ్గుతుంది.
- ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైరు ఏర్పాటు చేసుకోవాలి.



వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లను విడుదల చేసిన విద్యుత్ శాఖ అధికారులు (ఫైల్)

ఫోన్ చేయాలి

విద్యుత్ లైన్లు తెగిపోయినా, స్తంభాలు పడిపోయినా, ఇళ్లలో విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు లేదా, సిబ్బందికి లేదా 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. దీంతో విద్యుత్ శాఖ వారు తక్షణమే సరఫరాను నిలిపివేసి ప్రమాద తీవ్రత ఎక్కువ కాకుండా చర్యలు తీసుకుంటారు. ప్రమాదాలు జరగకుండా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, విజిలెన్స్ అధికారులు కలిసి అన్ని కార్యాలయాలు, ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సదస్సులు నిర్వహిస్తున్నాం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు ప్రమాదాల బారిన పడకుండా అధికారులతో ప్రతి డివిజన్‌లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కరపత్రాల పంపిణీ, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– విజయన్, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ

ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలం

- ఎస్పీ జి.కృష్ణకాంత్



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్, పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ‘ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. అప్పుడే గుండె పదిలంగా ఉంటుంది’ అని ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం నెల్లూరులోని కేవీఆర్ సర్కిల్ నుంచి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్ వరకు అపోలో హాస్పిటల్, పోలీసు శాఖ నిర్వహించిన వాక్‌థాన్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు వ్యక్తిగత ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలన్నారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గుండె జబ్బులు పెరుగుతున్నాయన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని సూచించారు. అపోలో హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ పోలీసులు మానసికఒత్తిడికి దూరంగా ఉంటూ తేలికపాటి వ్యాయామాలు చేయడం ద్వారా గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండొచ్చన్నారు. అనంతరం వైద్యులు పోలీసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, అపోలో వైద్యులు విజ్ఞచరణ్, షర్మిలి, నాగభూషణం, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వంట మీరే చేసుకోండి



చపాతీలు తయారు చేస్తున్న విద్యార్థినులు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం విద్యార్థినులే చపాతీలు తయారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ 450 మందికిపైగా విద్యార్థినులున్నారు. ప్రతి ఆదివారం మెనూ ప్రకారం వారికి చపాతీలు చొప్పున ఇవ్వాలి. వందల సంఖ్యలో తయారు చేయాలంటే ముగ్గురు వంటవాళ్ల వల్ల కాదని పిల్లల చేత పని చేయించారు. ఇలా గతం నుంచి జరుగుతోందని ప్రిన్సిపల్ కామేశ్వరి పేర్కొనడం గమనార్హం. వందల సంఖ్యలో చపాతీలు తయారు చేయాలంటే మెషీన్ ఉండాలని, అది ప్రభుత్వం ఇవ్వకపోవడంతో విద్యార్థుల సహకారంతో చేయిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్ వాసి దుర్మరణం



దినేష్ భట్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నేపాల్ వాసి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నేపాల్ దేశానికి చెందిన దినేష్ భట్ (27) రెండు నెలలుగా గొలగమూడిలోని ఎస్ఎస్ బిరియాని సెంటర్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు నెల్లూరుకు వచ్చి లీలామహల్ సెంటర్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దినేష్ గొలగమూడి నుంచి నెల్లూరుకు వచ్చాడు. పనిముగించుకుని అర్ధరాత్రి గొలగమూడికి బయలుదేరాడు. ఈ క్రమంలో కనుపర్తిపాడు క్రాస్‌కు వెళ్లాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్సై కిశోర్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితులు, వాహనాలతో పోలీసులు

కోవూరు: మోటార్‌బైక్‌లను దొంగతనం చేస్తున్న ముఠాను కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో ఉన్న ఎంప్లాయీస్ కాలనీలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడు పంచాయతీ పరిధిలోని బండారుమాన్యంలో నివాసం ఉండే కె.రవి, సత్యవతినగర్‌లో ఉండే సయ్యద్ రఫీలు తమ ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేశారని కోవూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రంగనాథ్ గౌడ్ క్రైమ్ పార్టీ సీసీఎస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎంప్లాయీస్ కాలనీకి వెళ్లగా ముగ్గురు నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. కోవూరులోని శాంతినగర్‌కు చెందిన గంధంశెట్టి రవీంద్ర, పెళ్లకూరు కాలనీకి చెందిన షేక్ కరిముల్లా, నాగరాజుగా గర్తించారు. ఆ ముగ్గురూ ఇంటి బయట ఉండే బైక్‌లను దొంగతనం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వాహనాల నంబర్లు తారుమారు చేసి కుదువ పెట్టడం, విక్రయాలు చేయడం వంటివి చేస్తున్నట్లు గుర్తించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనం చేసిన 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

హైవేపై కంటైనర్ లారీలో చోరీ

- కంప్యూటర్ మానిటర్లు, ఎలక్ట్రికల్ వస్తువుల అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరుసత్రం వద్ద ఆదివారం తెల్లవారుజామున కంటైనర్ లారీలో చోరీ జరిగింది. దుండగులు రూ.లక్ష విలువైన కంప్యూటర్ మానిటర్లు, టీవీ, ఎలక్ట్రికల్ వస్తువులను అపహరించుకెళ్లారు. లారీ డ్రైవర్ మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి కథనం మేరకు.. సీఎస్‌డీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన కంటైనర్ లారీ చెన్నై నుంచి కంప్యూటర్ మానిటర్లు, టీవీలతోపాటు 87 రకాల ఎలక్ట్రికల్ వస్తువులతో విజయవాడకు బయలుదేరింది. డ్రైవర్ నాగరాజుకు నిద్ర వస్తుండడంతో కొండూరుసత్రం బస్ స్టాప్ వద్ద లారీని ఆపి ఎదురుగా ఉన్న టీ స్టాల్‌కు వెళ్లాడు. గంట సమయం తర్వాత వచ్చి చూడగా కంటైనర్ తలుపులు పగులుగొట్టి ఉన్నాయి. లోపల పలు వస్తువులు లేకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రాంబాబు, ఎస్సై రాకేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం ఎస్సై బ్రహ్మయ్య ఆధ్వర్యంలోని బృందం వేలిముద్రలను సేకరించింది.

విద్యుత్ షాక్‌తో గేదె, దూడ మృతి



చేజర్ల: మండలంలోని మడపల్లి గ్రామ పొలంలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై గేదె, దూడ మృతిచెందాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈగ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన గేదె, దూడను మేతకు పొలానికి తోలాడు. విద్యుత్ తీగలు తెగిపోయి ఉండగా మూగజీవాలు దానికి తగిలి షాక్‌కు గురై మృతి చెందాయి. దీంతో బాధిత పాడిరైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే టార్గెట్

- ఉచిత ఇసుక మాటలకే పరిమితం
- టీడీపీ వారు తప్ప ఇంకెవరు తోలుకున్నా కేసుల నమోదు
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు



పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఇసుక ట్రాక్టర్లు

కొండాపురం: ఇసుక ఉచితమని కూటమి ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. సామాన్యులు, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఇసుక తోలుకుంటే టీడీపీ నాయకులు సహించడం లేదు. పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయిస్తున్నారు. కలిగిరి సర్కిల్ పరిధిలో ఉన్న కలిగిరి, కొండాపురం పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులుగా మారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలొస్తున్నాయి. మండలంలోని సత్యవోలు పంచాయతీ లింగసపాళెం గ్రామంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గృహాలు కట్టించుకుంటున్నారు. ఈ క్రమంలో నాలుగు ట్రాక్టర్ల ద్వారా ఆదివారం ఇసుకను తోలుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కలిగిరిలో ఇద్దరు మీడియా ప్రతినిధులకు సమాచారమిచ్చారు. వీరు సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి మిడత వాగు వద్దకు చేరుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను ఆపివేసి రూ.లక్ష నగదు డిమాండ్ చేశారు. ఆ యజమానులు నగదు ఇచ్చేందుకు నిరాకరించారు. ఇళ్లు నిర్మించుకుంటున్నామని, వదిలేయాలని ప్రాధేయపడినా కనికరించలేదు. టీడీపీ నాయకుల ఒత్తిడితో నాలుగు ట్రాక్టర్లను కొండాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

యథేచ్ఛగా..

మండలంలో 19 పంచాయతీల్లో గరిమెన పెంట, గొట్టిగుండాల, సాయిపేట, కొండాపురం, గానుగపెంట పంచాయతీ పరిధిలో వాగులు ప్రవహిస్తున్నాయి. వీటి నుంచి ఇసుకను అధికార పార్టీకి చెందిన వారు యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యులు, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తమ అవసరాల నిమిత్తం ఒకటి, రెండు ట్రాక్టర్లు ఇసుక తోలుకుంటే అధికార పార్టీ నాయకులు సహించడం లేదు. పోలీసుల చేత కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది సొంతింటి కల నెరవేరడం లేదు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.90
సన్నవి	రూ.50
పండ్లు	రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	134
లేయర్ (లైవ్)	115
బ్రాయిలర్ చికెన్	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	264
లేయర్ చికెన్	195